క్లుప్తంగా

ఉపాధి పనుల పరిశీలన



కనుమూరు(పామర్రు): మండల పరిధిలోని కనుమూరు గ్రామంలో ఉపాధి పనులను ఏపీవో పొలు రాజు శనివారం పరిశీలించారు.పొలాల్లో నీరుదిగువకు ప్రవహించేలా పంట బొదె పనులు చేయాలని అన్నారు. వేసవిలో ఉపాధి కూలీలకు తాగునీటికి, నీడ ఏర్పాటుకు అదనంగా నగదు చెల్లించడం జరుగుతోందని, దీనిని కూలీలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఫీల్డు అసిస్టెంట్‌లు, మేట్లు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

సుబ్బారాయుడికి ప్రత్యేక పూజలు



ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషగిరిరావు (శేషు) దంపతులు శనివారం దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ శొంఠి నాగరాజు ఆధ్వర్యంలో అర్చకులు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికారు. శేషు దంపతులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి శేషవస్త్రాలతో శేషు దంపతులను సత్కరించి, చిత్రపటాన్ని అందించారు. ఆలయ పాలకవర్గ సభ్యులు సిబ్బంది పాల్గొన్నారు.

కౌలు రైతులను ఆదుకోవాలి



తోట్లవల్లూరు: కౌలు రైతులను ప్రభుత్వం ఉదారంగా ఆదుకోవాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.రాధాకృష్ణ కోరారు. కౌలు రైతు రక్షణయాత్ర తోట్లవల్లూరులో శనివారం సాయంత్రం ప్రారంభమైంది. ఈ సందర్భంగా జరిగిన సభలో రాధాకృష్ణ మాట్లాడుతూ భూయజమానులతో సంబంధం లేకుండా కౌలురైతులకు కార్డులు మంజూరు చేయాలని పేర్కొన్నారు. ఎవరైతే క్షేత్ర స్థాయిలో పంటలు పండిస్తున్నారో వారికే ప్రభుత్వం రాయితీలను అందించాలని డిమాండ్ చేశారు. కౌలురైతుల సంక్షేమం కోసం తోట్లవల్లూరు నుంచి మంగళగిరి వరకు కౌలురైతు రక్షణయాత్ర నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 17న సీసీఎల్‌ఏ కార్యాలయం వద్ద సమస్యల సాధనకు ధర్నా నిర్వహించనున్నట్లు రాధాకృష్ణ తెలియజేశారు. కౌలురైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ, ప్రధానకార్యదర్శి ఎం. హరిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.సుబ్బారావు, పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన



మండవల్లి: కేంద్ర ప్రభుత్వ పథకాలపై బీజేపీ నేతలు అవగాహన కల్పించారు. అసెంబ్లీ కన్వీనర్ శివశంకర్ అధ్యక్షతన కిసాన్‌మోర్చ జిల్లా అధ్యక్షుడు కీర్తి రామ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో లోకుమూడి దత్తాశ్రమంలో శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఏలూరు జిల్లా అధ్యక్షుడు కె.సుధాకర్, కిసాన్‌మోర్చ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుచ్చిరాజు హాజరయ్యారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణ, జిల్లా మహిళా అధ్యక్షురాలు అడపా శోభారాణి, మండల అధ్యక్షుడు సమయం ఏసుబాబు, సత్యవోలు నాగలక్ష్మి, కట్టారాఘవులు, మెడికల్ సెల్ కన్వీనర్ బండారు వేంకటపతిరాజు, శ్యామల రాజ్‌గౌడ్, తానంకి సాయి, సత్యనారాయణ, కొల్లిపర నాగరాజు, కోక శ్రీనివాస్, పామర్తి రాంబాబు, పామర్తి రామకృష్ణ, ఎం.రమణ పాల్గొన్నారు.

సచివాలయాల్లో సత్వర సేవలు

- ఎంపీ వల్లభనేని బాలశౌరి
- అగినపర్రులో సచివాలయ భవనాన్ని ప్రారంభించిన ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే అనిల్‌కుమార్
- కమ్యూనిటీ హాలు, రోడ్ల నిర్మాణానికి నిధుల మంజూరుకు హామీ



అగినపర్రులో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే అనిల్‌కుమార్

పమిడిముక్కల: సచివాలయ వ్యవస్థ ఏర్పాటు, వలంటీర్ల నియామకం ద్వారా ప్రజలకు ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందుతున్నాయని మచిలీపట్నం పార్లమెంట్ సభ్యుడు వల్లభనేని బాలశౌరి అన్నారు. అగినపర్రులో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్‌తో కలిసి శనివారం ప్రారంభించారు. సచివాలయాన్ని పరిశీలించి, ప్రజలకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకొన్నారు. పమిడిముక్కల ఎస్సీ కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఎంపీ, ఎమ్మెల్యే స్థలాన్ని పరిశీలించారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.35 లక్షలు మంజూరు చేస్తానని ఎంపీ బాలశౌరి హామీ ఇచ్చారు. మంటాడ శివారు రెడ్డిపాలెం, ఇందిరమ్మ కాలనీల్లో ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పర్యటించారు. నిర్మాణంలో ఉన్న అంతర్గత రోడ్లను పరిశీలించారు. కాలనీల్లో ప్రస్తుతం రూ.55 లక్షలతో రోడ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయని, మరో రూ.30 లక్షలు మంజూరు చేస్తానని ఎంపీ తెలిపారు. రోడ్ల పనులు నాణ్యతతో చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. రెండో సచివాలయం, కమ్యూనిటీ హాల్ కావాలని గ్రామస్తులు కోరగా పరిశీలిస్తామన్నారు. నియోజకవర్గంలో రోడ్లు, కమ్యూనిటీ హాల్‌ల నిర్మాణానికి పెద్ద మొత్తంలో నిధులు కేటాయించిన ఎంపీ బాలశౌరికి ఎమ్మెల్యే, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీ, ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీఓ సుధా ప్రవీణ్, తహసీల్దార్ రాజ్యలక్ష్మి, డీఈ శ్రీనివాసరావు, ఎంపీపీ కాసాని వేద సుప్రజ, మండల పార్టీ అధ్యక్షుడు యలమంచలి గణేష్, వైస్ ఎంపీపీలు గంజాల సీతారామయ్య, కొడమంచిలి మహేష్, ఎంపీటీసీలు మేరుగ లక్ష్మి, గుర్విందపల్లి వంశీ, సర్పంచ్ కోట మణిరాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కినేని సతీష్, బొర్రా చినబాబు, రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ కంభపు రాంబాబు, నియోజకవర్గ బూత్ కన్వీనర్ మారపాక మహేష్, పార్టీ నాయకులు యేనుగ మస్తాన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వీరంకిలాకు–కూచిపూడి రోడ్డు అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్
- అగినపర్రులో గడప గడపకు మనప్రభుత్వం



లబ్ధిదారుడికి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

పమిడిముక్కల: వీరంకిలాకు నుంచి అగినపర్రు మీదగా కూచిపూడి వెళ్లె ఆర్అండ్‌బీ రహదారి అభివృద్ధికి నిధులు మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ తెలిపారు. మండలంలోని అగినపర్రులో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికీ తిరిగారు. ప్రభుత్వం ద్వారా లబ్ధిదారులకు సమకూరిన పథకాల వివరాల బుక్‌లెట్లను అందజేశారు. గత నాలుగేళ్లగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. స్థానికుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరుపై ఆయన ఆరా తీశారు. ప్రధాన రహదారి అధ్వానంగా ఉందని, రాకపోకలు సాగక ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు తెలిపారు. రహదారి అభివృద్ధికి చర్య తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అంతర్గత రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తామన్నారు. నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పాలన సాగిస్తున్నానని తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుధా ప్రవీణ్, తహసీల్దార్ డి.రాజ్యలక్ష్మి, సర్పంచ్ కోట మణిరాజు, ఎంపీటీసీ జుఝువరపు శృతి, పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కినేని సతీష్, మండల పార్టీ అధ్యక్షుడు యలమంచలి గణేష్, వైస్ ఎంపీపీలు గంజాల సీతారామయ్య, కొడమంచిలి మహేష్, నియోజకవర్గ బూత్ కన్వీనర్ మారపాక మహేష్, పార్టీ నాయకులు యేనుగ మస్తాన్‌రావు, బొబ్బా రామారావు, వీరంకి వెంకటేశ్వరరావు, వీర్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్వామి వారికి వెండి వస్తువుల సమర్పణ



మోపిదేవి: మోపిదేవి వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి చిలకలూరిపేటకు చెందిన సోమేపల్లి హర్షవర్ధనాదేవి కిలో వెండి వస్తువులు సమర్పించారు. శనివారం ఉదయం స్వామి వారిని దర్శించుకున్న ఆమె రెండు వెండి శఠారిలు, ఒక వెండి ప్లేటు, ఒక వెండి స్పూను ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణకు అందజేశారు. మరో భక్తురాలు ప్రకాశం జిల్లా సంతమాగులూరుకు చెందిన పెనుమాక మురళీ కృష్ణవేణి 300 గ్రాముల వెండి ప్లేట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా దాతలను సన్మానించి స్వామి వారి ప్రసాదాలు అందజేశారు.

ఆటపాటలతో సందడిగా గ్రంథాలయాలు



జమీగొల్వేపల్లిలో ఆటల పోటీల్లో విద్యార్థులు



అక్షరాలు సులువుగా రాసే విధానం వివరిస్తున్న భాస్కరరావు

జమీగొల్వేపల్లి(పామర్రు): మండలంలోని జమీగొల్వేపల్లిలోని శాఖ గ్రంథాలయంలో శనివారం చిన్నారులకు ఆటల పోటీలను నిర్వహించారు. విద్యార్థులు క్యారమ్స్, చెస్, చైనీస్, లూడో, వైకుంఠపాళి, హౌస్, బిజినెస్ వంటి ఆటలను ఎంతో ఉత్సాహంగా ఆడారు. ఈనెల 11వ తేదీన నిర్వహించబోయే ముగింపు కార్యక్రమంలో వివిధ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేస్తామని గ్రంథాలయాధికారి వి.నాగ సురేష్ తెలిపారు. ఆటలపోటీలకు న్యాయ నిర్ణేతలుగా గుమ్మడి ఉషా దేవి, పి.పద్మావతి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు గ్రంథాలయ పాఠకులు, సిబ్బంది పాల్గొన్నారు. పామర్రులోని గ్రంథాలయంలో విద్యార్థులకు నీతి కథలు చెప్పించారు. కథలు చదివించారు. గ్రంథాలయ అధికారి ఎం.ఝాన్సీరాణి పాల్గొన్నారు.

మండవల్లి: మండవల్లి శాఖ గ్రంథాలయంలో విశ్రాంత చిత్రలేఖనోపాధ్యాయుడు ఎస్ భాస్కరరావు పిల్లలకు అక్షరాలను ఆకర్షణీయంగా, పెద్ద సైజులో రాయటంపై శిక్షణ ఇచ్చి విద్యార్థులతో రాయించి ప్రదర్శించారు. భాస్కరరావు మాట్లాడుతూ చిత్రలేఖనం సృజనాత్మక కళ అని చిత్రలేఖనం చేసే సమయంలో మనస్సు, శరీరం స్వాధీనంలో ఉండి ఏకాగ్రతతో ఉండటం ద్వారా మంచి చిత్రకారులుగా ఎదగగలుగుతారన్నారు. గ్రంథాలయాధికారి షేక్‌పర్వీన, జి.నవదీపిక, యామిని, నమ్రత, నవనీత్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



లంకె శ్రీను మృతదేహం

పామర్రు: రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహన చోదకుడు దుర్మరణం పాలైన సంఘటన మండల పరిధిలోని కనుమూరులో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విజయవాడకు చెందిన లంకె శ్రీను(45) మచిలీపట్నంలోని తన బంధువుల ఇళ్లకు వెళ్లి తిరిగి వస్తుండగా కనుమూరు గ్రామం వద్ద ఎదురుగా ఉన్న వాహనాన్ని తప్పించబోయి మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. ఈసంఘటనలో శ్రీను బైక్‌పై నుంచి ఎగిరి రోడ్డుపై పడ్డాడు. దీంతో తల వెనుక భాగానికి బలమైన గాయం అయి శ్రీను అక్కడి కక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పామర్రు ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి సంఘటనా స్థలం చేరుకుని మృతుని వివరాలను సేకరించారు. ఈ విషయమై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇంటి నిర్మాణాలు వేగవంతం చేయండి

ఎమ్మెల్యే డీఎన్నార్



కైకలూరు: ఇంటి నిర్మాణాలను లబ్ధిదారులు వేగవంతంగా పూర్తి చేసుకోవాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. కై కలూరు జగనన్న గ్రీన్ విలేజ్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన శనివారం పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దాదాపు 3,000 మంది లబ్ధిదారులకు నివేశన స్థలాలు జగనన్న విలేజ్‌లో అందజేశామన్నారు. కాలనీలో లబ్ధిదారులకు ఇప్పటికే తాగునీరు, విద్యుత్, రహదారులను ఏర్పాటు చేశామన్నారు. రెవెన్యూ సిబ్బంది సరిహద్దు రాళ్లను ఏర్పాటు చేశారన్నారు. దరఖాస్తుదారులలో కొందరికి త్వరలో పొజిషన్ చూపిస్తారన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి గృహనిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఐటీఐ విద్యార్థులకు అవగాహన

గుడివాడ టౌన్: స్థానిక కేబీఆర్ గవర్నమెంట్ ఐటీఐ కళాశాల, కేటీఆర్ మహిళా కళాశాల, ఏఎన్నార్ కళాశాలల్లో శనివారం విద్యార్థులకు అవగాహన సదస్సు రెండో రోజు శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్ వీ సుబ్బారావు, ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ జి .హరిధర్మేంద్ర, ఏఎన్నార్ కళాశాల ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్, కేటీఆర్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

మల్లవోలులో మూడు పూరిళ్లు దగ్ధం

రూ.6.5 లక్షల ఆస్తి నష్టం

గూడూరు: గూడూరు మండలం మల్లవోలులో శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలో నాలుగు కుటుంబాలు వీధిన పడ్డాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం సంభవించినట్లు అధికారులు గుర్తించారు. మధ్యాహ్నం జరిగిన అగ్ని ప్రమాదంలో షేక్ జమీలున్నీసా, షేక్ హమీదున్నీసా, షేక్ రఫీబ్‌లకు చెందిన మూడు తాటాకు ఇళ్లు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. షేక్ ఉస్మాన్‌కు చెందిన రేకుల షెడ్డు పాక్షికంగా కాలింది. ఉవ్వెత్తున ఎగసిన అగ్నికీలలను గుర్తించిన చుట్టుపక్కల వారు బాధితులను రక్షించడానికి సహాయ చర్యలు చేపట్టారు. సమాచారం అందుకున్న బందరు అగ్నిమాపక కేంద్రం సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసింది. సర్పంచి బొర్రా సాంబశివయ్య, ఆర్బీకే చైర్మన్ పర్నం పెదబాబు బాధితులను పరామర్శించారు. నిరాశ్రయులైన ఒక్కో కుటుంబానికి రూ.3 వేల నగదు, 25 కిలోల బియ్యం, నిత్యావసర వస్తువులు అందజేశారు.

గడ్డి వామి దగ్ధం

గ్రామంలో నాలుగు ఇళ్లు అగ్నికి ఆహుతైన ఘటన చల్లారక ముందే రైతు ఆలపాటి వెంకటేశ్వరరావుకు చెందిన ఐదు ఎకరాల గడ్డివామి దగ్ధమైంది. గుర్తు తెలియని వ్యక్తులు కాల్చి పడేసిన సిగరెట్ కారణంగా ప్రమాదం సంభవించినట్లు స్థానికులు తెలిపారు. బందరు అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసింది.

ఘనంగా దేవతల విగ్రహాల ప్రతిష్ఠ



పార్వతి అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్న ఆలయ నిర్వాహకులు



ప్రతిష్ఠా మహోత్సవంలో భక్తులు

పామర్రు: మండలంలోని రాపర్ల గ్రామంలో గణ్యశ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఘనంగా విఘ్నేశ్వర, పార్వతీ తదితర దేవతల ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఆలయంలో విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అగ్ని ధ్యానములు, క్షీరాధివాసాలను పూర్తి చేశారు. ధాతున్యాసం, రత్నన్యాసం నిర్వహించారు. అనంతరం విఘ్నేశ్వరస్వామి, పార్వతీ అమ్మవారి విగ్రహాలతో పాటుగా నవగ్రహ విగ్రహాలు, సుబ్రమణ్యేశ్వర స్వామి విగ్రహాలను ఉదయం 7.47 నిమిషాలకు మేళ తాళాలతో వేద మంత్రాల మధ్య అగ్నిహోత్రం వేణుగోపాల్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించారు. వెంకటేశ్వరస్వామి, పద్మావతి, మల్లిఖార్జునస్వామి ఆలయంలో అభిషేకాలను శత సహస్ర నామాలతో పూజలను ఆలయ అర్చకులు బి.పద్మాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కాకర్ల అర్జునరావు, ఓంకారం ట్రస్టు నిర్వాహకులు కాకర్ల విజయ మాధురి తదితరులు పాల్గొన్నారు. ఈ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం అనంతరం సుమారు 3 వేల మంది భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు.

అలరించిన శివ, కేశవుల కల్యాణం

వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో వేంకటేశ్వరస్వామివార్లకు, భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామివార్లకు కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివార్ల కల్యాణ మహోత్సవాన్ని తిలకించారు.

విగ్రహ, శిఖర, ధ్వజస్తంభ ప్రతిష్ఠ

కోసూరు(మొవ్వ): మండలంలోని కోసూరు గ్రామంలోని శ్రీ హనుమాన్ సీతా లక్ష్మణ పరివార సహిత శ్రీ కోదండరామ స్వామి వార్ల విగ్రహ ప్రతిష్ఠా, ధ్వజ, శిఖర అభినవ ప్రతిష్ఠా కార్యక్రమం శనివారం వైభవంగా నిర్వహించారు. పెదముత్తేవి ముముక్షుజన పీఠాధిపతులు శ్రీ సీతారామ్ గురుదేవ దంపతుల పర్యవేక్షణలో శ్రీ వైఖానస ఆగమ శాస్త్రరీత్యా ముత్తేవి వెంకట సత్యనారాయణాచార్యుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. క్షత్రియ రామాలయం అభివృద్ధి ట్రస్ట్ బోర్డ్ నిర్వాహకులు చిందా వీర వెంకట నాగేశ్వరరాజు, బోరుకాటి ప్రసాదరాజు, చిందా వీర వెంకట కుటుంబ రాజు దంపతులు పంచమి కుంభాభిషేకాలు, మహా పూర్ణాహుతి, శాంతి కల్యాణం తదితర పూజ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో జరిపారు. అనంతరం గ్రామంలో పెద్ద ఎత్తున అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు విజయవాడ రీజియన్ ఆర్టీసీ చైర్మన్ తాతినేని పద్మావతి, దేవదాయ శాఖ బందరు ఇన్‌స్పెక్టర్ మురారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ వరి విత్తనాలు సిద్ధం

ముదినేపల్లి రూరల్: మండలంలోని రైతుభరోసా కేంద్రాల్లో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి నారుమడులు పోసుకునేందుకు వరి విత్తనాలు సిద్ధంగా ఉన్నట్లు వ్యవసాయాధికారి బి. వేణుమాధవ్ శనివారం తెలిపారు. ప్రభుత్వం సాగుకు అనుమతించిన పలు రకాల వరివిత్తనాలు సబ్సిడీపై అందిస్తామన్నారు. వీటిలో బీపీటీ–5204 రకం 25 కిలోల బస్తా రూ.947.50 కాగా రూ.822.50 ధర చెల్లించాలన్నారు. ఎంటీయూ–1061 30 కిలోల బస్తా రూ.993, ఎంటీయూ–1064 రకం విత్తనాలు 30 కిలోల బస్తా రూ.993, ఎంటీయూ–1121 30 కిలోల బస్తా రూ.984 అందజేస్తారన్నారు. ఎంటీయూ 7029 రకం విత్తనాలు 30 కిలోల బస్తా రూ.933, ఎంటీయూ–1224 రకం 30 కిలోల బస్తా రూ.960 ధరకు అందజేస్తారని చెప్పారు.

సీఎం జగన్ దృష్టికి కొల్లేరు సమస్యలు

ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ



తాగునీటి సమస్యను ఎమ్మెల్సీ జయమంగళకు చెబుతున్న కొండమ్మ

కైకలూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి కొల్లేరు ప్రజల సమస్యలను ఇప్పటికే తీసుకువెళ్లినట్లు ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ చెప్పారు. ఆయన ఎంతో సానుకూలంగా ఉన్నారన్నారు. కొల్లేరు అభయారణ్యంలో పక్షులతో పాటు ప్రజల సంక్షేమం ముఖ్యమని భావిస్తూ అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఈ సందర్భంగా కొల్లేరు గ్రామమైన కొట్టాడలో గొర్రెలు మేపుతున్న బలే కొండమ్మ వద్దకు ఎమ్మెల్సీ శనివారం వెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చేపల వేట లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు పొట్టకూటి కోసం అనేక మంది వలస వెళ్లారని చెప్పింది. కొల్లేరు ఎండిపోయింది. చాలా చోట్ల చుక్క నీరు లేదు. గొర్రెలు, పశువులు అల్లాడుతున్నాయి. కొల్లేటి గ్రామాల్లో పశువులకు, ప్రజలకు తాగడానికి చెరువులు తవ్వించాలని ఆమె ఎమ్మెల్సీకి విన్నవించారు. ఎమ్మెల్సీ జయమంగళ మాట్లాడుతూ కొల్లేరు అభయారణ్యం జీవో 120లో నిర్ణయించిన 77,138 ఎకరాలను మినహాయించి మిగిలిన కొల్లేరులో భూములను అక్కడి పేదలకు పంపిణీ చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారన్నారు. ప్రధానంగా కొల్లేరు ఆపరేషన్ సమయంలో కైకలూరు నియోకవర్గం కైకలూరు, మండవల్లి మండలాల్లో 120 జీవోలో పేర్కొనని 7,500 ఎకరాల విస్తీర్ణంలో చేపల చెరువులను అధికారులు ధ్వంసం చేశారన్నారు. ప్రభుత్వం ప్రత్యేక అర్డినెన్సు ద్వారా అదనంగా ధ్వంసం చేసిన భూములను పంపిణీ చేయాలనే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినట్లు ఎమ్మెల్సీ చెప్పారు.